మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా వాల్దాస్ రాధమల్లేష్‌గౌడ్



వాల్దాస్ రాధ మల్లేష్‌గౌడ్

**కొల్చారం, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా వాల్దాస్ రాధమల్లేష్‌గౌడ్ ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా సోమవారం కొల్చారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో బిజెపి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పచెప్పిన అధిష్టాన నిర్ణయాన్నీ వమ్ము చేయకుండా బీజేపీని జిల్లాలో మరింత బలోపేతం చేస్తానని చెప్పారు. అలాగే నిరంతరం కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. తన ఎన్నికకు కృషి చేసిన రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణకు, జిల్లా ఎన్నికల అధికారి మీసాల చంద్రయ్య, బీజేపీ అధిష్టానం పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు నూతన బీజేపీ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన వాల్దాస్ రాధ మల్లేష్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రాజకీయాల్లో విమర్శలు ప్రతి విమర్శలే ఉండాలి

### ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేత అందే బీరన్న

**చేర్యాల, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** రాజకీయాలంటే విమర్శలు ప్రతి విమర్శలు ఉండాలే తప్పా కార్యకర్తలను అభిమానులను రెచ్చగొట్టే విధంగా ఏ రాజకీయ పార్టీ వ్యవహరించకూడదని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ అందే బీరన్న అన్నారు. మూడురోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ నాయకులు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్లెక్సీకి చెప్పుల దండ వేసి దహనం చేయడం దీంతో భగ్గుమన్న బిఆర్ఎస్ నాయ కులు జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించడంతో ఈ ప్రాంత మంతా విద్వేషాలకు దారి తీయబోతోందని సోమవారం అందె బీరన్న స్పం దించారు. చేర్యాల ప్రాంతంలో అభివృద్ధిని పక్కనపెట్టి ఇలాంటి సంస్కృతికి తెరలేపడం అధికార పార్టీకైన ప్రతిపక్షానికైన మంచిది కాదన్నారు. గౌరవ ప్రధాన మైన హోదాలో ఉన్న వ్యక్తి చిత్రపటానికి చెప్పుల దండవేసి కాల్చి వేయడం సరైంది కాదని ఈ సంఘటనకు కారకులైన వారిపై అధికారులు చర్యలు తీసుకుని భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

### జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని

## విజయవంతం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. సోమవాం జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏ ఒక్క విద్యార్థి మిస్‌కాకుండా మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో జూనియర్ కళాశాల్లోనూ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి గ్రామాల్లో టాంటాం చేయాలన్నారు. పిల్లలకు చేతుల, వ్యక్తిగత పరిశుభ్రతపైన అవగాహన కల్పించాలని తెలిపారు. వందశాతం విద్యార్థులకు మాత్రలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఓ పల్వన్‌కుమార్, డిడబ్ల్యూఓ లక్ష్మీకాంత్‌రెడ్డి, మెప్మా పిడి హన్మంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

## భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలి

### సిపి డాక్టర్ అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



మెడల్ సాధించిన పోలీసు అధికారులు,సిబ్బందిని అభినందిస్తున్న సిపి

రాష్ట్రస్థాయి కరాటేలో గోల్డ్‌మెడల్, పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్, బాడీ బిల్డింగ్‌లో సిల్వర్ మెడల్, టెన్నిస్‌లో కాంస్య పతకాలు సాధించిన సిద్దిపేట పోలీసు కమిషనరేట్ అధికారులు, సిబ్బందిని సోమవారం సీపీ కార్యాలయంలో సీపీ డాక్టర్ అనురాధ అభినందించారు. కరీంనగర్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోలీసు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో రాజన్న సిరిసిల్ల జోన్ తరుపున ప్రాతనిథ్యం వహించి సిద్దిపేట పోలీసు అధికారులు, సిబ్బంది మెడల్స్ సాధించారు. ప్రసాద్ ఏఆర్ కానిస్టేబుల్ కరాటేలో గోల్డ్‌మెడల్, లక్ష్మణ్ కానిస్టేబుల్ బాడీబిల్డింగ్‌లో సిల్వర్, ఆర్ఎస్ఐ రోహిత్ పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్స్ సాధించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాజేష్, లాన్‌టెన్నిస్ టీం ఈవెంట్‌లో కాంస్య,రాజేష్ టెన్నిస్ ఓపెన్‌ల డబుల్స్‌లో కాంస్య పతకాలు సాధించారు. అలాగే ఖో-ఖోలో రాకేష్, శ్రీకాంత్, షేక్‌బాబా, లింగం కానిస్టేబుళ్లు కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన వారిని అభినందించి భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు సుభాష్ చంద్ర బోస్, కిరణ్, రాష్ట్ర పోలీసుసంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయానికి నిరసనగా

## ప్రధాని, ఆర్థిక మంత్రుల దిష్టిబొమ్మలు దగ్ధం

**సంగారెడ్డి బ్యూరో ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**

కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం సంగారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతారామన్ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి మాట్లాడుతూ కేంద్రం తెలంగాన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. లక్షల రూపంలో పన్నులు కడుతున్నా మనకు మాత్రం గుండు సున్నా ఇచ్చింది మండిపడ్డారు. నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలు అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు కానీ తెలంగాణాకు మాత్రం కొత్తగా ఒక్క ప్రాజెక్ట్ ఒక్క రూపాయి కూడా తెచ్చే దమ్ము లేదు విమర్శించారు తెలంగాణ ప్రజలకు బిజెపి క్షమాపణ చెప్పాలని అన్నారు ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, బ్లాక్ అధ్యక్షుడు రఘుగౌడ్, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రామచందర్‌నాయక్ సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సడకుల కుమార్, సదాశివపేట పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, కంది మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, నాయకులు బొంగుల రవి,కిరణ్‌గౌడ్,కూన సంతోష్, షఫీ, మహేష్,కసిని రాజు,తహెర్ పాషా,అరిఫ్,అర్జున్, నరేన్, చిత్తరి యాదగిరి, సునీల్ రాజంపేట శ్రీను,కుతుబ్, జహీర్, పాల్గొన్నారు.



ప్రధాని, ఆర్థికమంత్రుల దిష్టిబొమ్మలను దగ్ధంచేస్తున్న కాంగ్రెస్ నేతలు





ప్రత్యేక అలంకరణలో శ్రీ విద్యాసరస్వతి అమ్మవారు, అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## వర్గల్ క్షేత్రంలో శ్రీవసంత పంచమి వైభవం

### అమ్మవారి నామ స్మరణతో మార్మోగిన శంభుగిరులు.. ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**వర్గల్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):**

శ్రీవసంత పంచమి (శ్రీపంచమి) పర్వదినాన్ని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్‌క్షేత్రం ఆధ్యాత్మిక వైభవం సంతరించుకుంది. వసంత పంచమి మహోత్సవాన్ని పురస్కరించుకొని క్షేత్ర సముదాయం అమ్మవారి నామస్మరణతో మార్మోగగా, సోమవారం తెల్లవారుజామున శ్రీ విద్యాసరస్వతి అమ్మవారికి వేదమూర్తులైన బ్రాహ్మణోత్తముల మంత్రోశ్చరణల మధ్య ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి శ్రీ పంచమి వేడుకలకు అంకురార్పణ చేశారు.అనంతరం అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, పల్లకి సేవ, లక్ష పుష్పార్చన, చెప్పన్‌బోగ్ నివేదన, శ్రీ విద్యా జ్యోతి దివ్య దర్శనం తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పర్వదినం సందర్భంగా క్షేత్రానికి 50 వేల మందికి పైగా భక్తులు తరలిరాగా 10 వేల మందికిపైగా చిన్నారులకు అక్షరాభ్యాసం జరిగినట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేయగా రెండు రోజుల పాటు ఆలయ సముదాయం భక్తులతో కిటకిటలాడింది.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

అమ్మవారిని దర్శించుకోవడానికి ఈవేడుకల్లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తోపాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.

## ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**నిజాంపేట (రామాయంపేట), ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :**

జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్క పొలిటికల్ పార్టీ, ఇండిపెండెంట్ అభ్యర్థి తూచా తప్పకుండా పాటించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. సోమవారం నిజాంపేట మండల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అక్కడి జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను సంబంధిత తహసీల్దార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని 21 మండలాల పరిధిలో గ్రాడ్యుయేట్(22), టీచర్స్(21) మొత్తం 43 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని, 24 గంటలు, 48 గంటలు, 72 గంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. ఈ ఎన్నికలకు బ్యాలెట్ పేపర్స్ ఉపయోగిస్తారని, అవసరమగు బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ప్రచారానికి అవసరమైన అనుమతులను పొలిటికల్ పార్టీలు తప్పనిసరిగా సంబంధిత ఆర్డీవోల దగ్గర అనమతి తీసుకోవాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు కట్టుదిట్టంగా జరగాలని ఎక్కడా ఎటువంటి అలసత్వం ఉండటానికి వీలు లేదన్నారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా ముందుకు పోతున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో నిజాంపేట తాసిల్దార్ సురేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



నిజాంపేటలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

## సహాయ కార్మిక కార్యాలయానికి సుస్తీ..

### మధ్యాహ్నం వరకు హాజరుకాని కార్యాలయ సిబ్బంది

**నారాయణఖేడ్, జనవరి 3, ప్రభాతవార్త:**

ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుచేసి భవనాలు, కార్యాలయంలో ఉద్యోగులను నియమిస్తే నారాయణఖేడ్ పట్టణంలోని సహాయ కార్మిక కార్యాలయ అధికారులు మాత్రం తమ ఇష్టానుసారంగా సమయపాలన లేకుండా విధులకు హాజరవుతున్నారు.నారాయణఖేడ్ నియోజకవర్గం కింద నారాయణఖేడ్, కంగ్టి, కల్హేర్, నాగల్‌గిద్దా, మనూరు, సిర్గాపూర్, నిజాంపేట మండలాలకు చెందిన ప్రజలు ఆయా పనులకు కార్యాలయానికి వస్తుంటారు. ప్రభుత్వం ఉద్యోగులు పనిచేసేచోట ఉండాలని సూచించినా విధులకు మాత్రం డుమ్మాలు కొట్టడం అధికారులకు మాములైంది. ఆయా మండలాలకు చెందిన ప్రజలు రోజుకు ఎంతో మంది లేబర్ కార్డుకు, ఇతర పనుల నిమిత్తం నారాయణఖేడ్ కార్యాలయానికి వస్తే అధికారులు మాత్రం రోజు 12 గంటల వరకు రాకపోవడం విచిత్రంగా ఉంది. సోమవారం అధికారులు రెండుగంటలైనా సహాయ కార్మిక అధికారి గిరిరాజు, జూనియర్ అసిస్టెంట్ సాయిలు రెండుగంటలవరకు అధికారులు రాలేదు. అధికారులు ఉదయం 10.30 గంటలలకు విధులకు రావల్సి ఉన్నా, ఇక్కడమాత్రం దర్జాగా వంతులవారీగా రోజుకు ఒకరుచొప్పున వస్తుంటారని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.




కార్యాలయంలో ఉద్యోగులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కొత్త లేబర్ కార్డుకు ప్రజలు దరఖాస్తులు చేసుకుని నెలరోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు తెలిపారు. కార్యాలయంలో కేవలం అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే ప్రతిరోజు దర్శనమిస్తుం టారని ప్రజలు తెలిపారు.

ఇప్పటికైనా జిల్లా కలెక్టరు, రాష్ట్ర కమిషనర్ జోక్యం చేసుకుని స్థానిక కార్యాలయం లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా లేబర్ అధికారిని వివరణ కోరేందుకు ఫోన్లో ప్రయత్నించగా ఫోన్ నాట్ కవరేజ్ అని సమాధానం వచ్చింది.



కవితకు మల్లన్నస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## ఎమ్మెల్సీ కవితను కలిసిన బిఆర్ఎస్ నేతలు

**కొమురవెల్లి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** హైదారాబాద్ నుంచి సిద్దిపేట మీదుగా కరీం నగర్ పర్యటనకు వెళ్తున్న జాగృతి అధ్యక్షు రాలు,ఎమ్మెల్సీ కవితకు సోమవారం కొమురవెల్లి స్వాగతతోరణం వద్ద బిఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సిలివేరు సిద్దప్ప, ఎరుపుల మహేష్, సార్ల కిష్టయ్య, ముత్యం నర్సింహులుగౌడ్, గొల్లపల్లి కిష్టయ్య, కొండ శ్రీధర్, కనకమల్లేష్, గొల్లపల్లి అంజనేయులు, గజ్జె వెంకటేష్, విరాట్‌బాబు, చల్ల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

### డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని డిసిసి అధ్యక్షులు తూకుంట నర్సారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణపై చూపిన వివక్షకు నిరసనగా టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వద్ద ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలసీతారామాన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలో ఉండడంతోనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులో మొండి చెయి చూపిందన్నారు. సమయం వచ్చినప్పుడు బిజెపికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కడెం లింగమూర్తి, పార్టీ నాయకులు ఎం.డి.ఇమామ్(అత్తు), సొప్పదండి చంద్రశేఖర్, సాకి అనంద్, గంప మహేందర్‌రావు, కలీం, రియాజ్, రియాజుద్దీన్, మంజులరెడ్డి, బొమ్మల యాదగిరి, సాంబమూర్తి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## కంది జైలును సందర్శించిన న్యాయమూర్తి రమేష్



కంది సెంట్రల్ జైలును సందర్శిస్తున్న న్యాయమూర్తి రమేష్

**కంది, ఫిబ్రవరి 3, ప్రబాతవార్త:** మండల కేంద్రంలోని సెంట్రల్ జైలును సోమవారం జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని బెరక్లూ, గదులు, వంట గది, మరుగుదొడ్లు, జైలు పరిసరాలను పరిశీలించారు. జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందించాల్సిన సౌకర్యాలను అందించాలని జైలు సూపరింటిడెంట్‌కు సూచించారు. ఖైదీలతో సమయానికి బైల్స్,ములాఖత్ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఖైదీల కొరకు వండే ఆహారం సరుకులైన కూరగాయలు, బియ్యం ఉన్న గదిని పరిశీలించి పరసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను న్యాయమూర్తి పరిశీలించారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజావాణి

### -తహసీల్దార్ రజినికుమారి

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:**

ప్రజలసమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రామాయంపేట తహసీల్దార్ రజినికుమారి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రజలనుండి పలు దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో నేడు మండలవ్యాప్తంగా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ప్రజల నుండి వచ్చాయని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఈప్రజావాణి కార్య క్రమం జిల్లా అధికారుల ఆదేశాలమేరకు నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. మండలపరిధిలోని ప్రజలు పలుసమస్యలకు సంబంధించిన దరఖాస్తులు నేరుగా తమకు అందజేయాలని, ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని ఆమె సూచించారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రజినికుమారి



సరస్వతీ మాతను పూజిస్తున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు

## సరస్వతీ మాత జన్మదిన వేడుకలు

**చేర్యాల, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** అర్జునపట్ల గ్రామ ఉన్నత పాఠశాల లో శ్రీసరస్వతీ మాత జన్మదినోత్సవాన్ని విద్యార్థులు, ఉపా ధ్యాయులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే అమ్మవారికి అభిషేకం అర్చన హారతిని ఆధ్యాపకులు రామచంద్రమూర్తి చేయించగా గంగప్రసాద్ ఉపాధ్యాయులు పూజలో పాల్గొన్నారు. అనంతరం చిన్న పిల్లలకు అక్షరా భ్యాసం చేయించారు. అనంతరం మూర్తి మాట్లాడుతూ పాఠశాలలో సర స్వతి మాత అమ్మవారి విగ్రహం ఉండడం విద్యార్థుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




2001-2002 ఏడవ తరగతి పూర్వ విద్యార్థులు

**చేర్యాల, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** పోతిరెడ్డిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 2001-2002 ఏడవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 23 ఏళ్ల తరువాత ఒకచోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదివినబడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. అంతకుముందు గురువు శ్రీనివాస్‌కు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మండల విద్యాశాఖ అధికారి రచ్చ కిష్టయ్య హాజరై మాట్లాడుతూ చాలా ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులందరు కలుసుకునేందుకు ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అందులో విద్య నేర్పిన గురువులను గుర్తించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు.

## లక్ష డప్పులు వెయ్యి గొంతుకల గోడ పత్రిక ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

**ధూళిమిట్ట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించబోయే లక్షడప్పులు వెయ్యి గొంతుకల భారీ సాంస్కృతిక ప్రదర్శన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ధూళిమిట్టలో సభకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. భవిష్యత్తులో మాదిగ, మాదిగ ఉప కులాల భవిష్యత్తు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థికంగా ఎదగాలన్న ఏబిసిడి వర్గీకరణ ఏకైక మార్గం అన్నారు. ఈ సభకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు నల్ల రాజేష్, నాగులపల్లి సంపత్, పేరు బాలరాజు, పోతరాజు, చిన్న కనకయ్య, పోతరాజు వీరయ్య, బుచ్చాల నరసయ్య, డి.మల్లయ్య, చిలుక రాజయ్య, గుండె ప్రభాకర్, లింగాపూర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పిల్లలకు అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని తడకపల్లి ఇద్యారణ్య అవాస విద్యాలయంలోని శ్రీసరస్వతి అమ్మవారి దేవాలయంలో సోమవారం వసంతపంచమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గాయత్రి యజ్ఞంతో మొదలైన 30 కుటుంబాలు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యదర్శి మంతపురి నారాయణ విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే అంకితం కాకుండా ప్రస్తుత సమాజంలో శారీరక మానసిక బౌతిక ఆధ్యాత్మికంగా పిల్లలు ఎదగాలన్నారు. కార్యక్రమంలో శ్రీసరస్వతీ విద్యాపీఠం జిల్లా అధ్యక్షులు తడకమడ్ల ఈశ్వరయ్య, పాఠశాల అధ్యక్షులు కొమురవెల్లి శేఖరం, పాఠశాల సహ కార్యదర్శి మాంకాల లింగమూర్తి, కమిటీ సభ్యులు కాసా నాగరాజు, అకాడమీ ఇంచార్జి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుకునూరుపల్లి ఎంపిడిఓగా రాంప్రసాద్

**కొండపాక, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి ఎంపిడిఓగా రాంప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొండపాకలో భాగంగాఉన్న కుకునూరుపల్లిని గత ప్రభుత్వం నూతన మండలంగా ఏర్పాటు చేసి 20 నెలలు కావస్తుంది. అప్పటి నుండి ఇప్పటివరకు అన్ని శాఖాలకు అధికారులను ప్రభుత్వం నియమించినా ఒక ఎంపిడిఓ కార్యాలయాన్ని మాత్రం ఏర్పాటు చేయలేదు. తాజాగా ప్రభుత్వం కుకునూరుపల్లికి నూతనంగా ఎంపిడిఓ కార్యాలయాన్ని మంజూరు చేసింది. దీంతో సోమవారం అధికారులు కుకునూరుపల్లి అంగడిబజార్‌లోని అంగన్‌వాడి కేంద్రంపై అంతస్తులో ఎంపిడిఓ కార్యాలయాన్ని ప్రారంభించి రాంప్రసాద్‌కు ఎంపిడిఓగా బాధ్యతలు అప్పగించారు. రాంప్రసాద్ ఇప్పటి వరకు కొండపాక మండల ఎంపిడిఓ కార్యాలయంలో సూపరింటెండెంట్గా పనిచేశారు. కుకునూరుపల్లి మండలానికి మొదటి ఎంపిడిఓగా రాంప్రసాద్ అందరి మనస్సుల్లో గుర్తుండిపోతారు. కార్యాలయ ప్రారంభోత్సవంలో తహసీల్దార్ దండి సుజాత, కొ ండపాక ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకధికారి నాగరాజు, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, ఏపిఎం మగ్దుం అలీ, పిఆర్ ఎఈ తిరుపతిరెడ్డి, మండల ఎఒ గోవిందరాకజు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిసిలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఓ బాధ్యతలు చేపడుతున్న రాంప్రసాద్

# శ్రీసత్యసాయి సేవ సంస్థల సేవలు ప్రశంసనీయం

### ప్రముఖ సినీ నటుడు సుమన్

**కొండపాక, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మానవాళి మనుగడకు అత్యంత ముఖ్యమైన విద్య, వైద్యం, ఆరోగ్యం, తాగు నీరు లాంటి సౌకర్యాలను పేదలకు ఉచితంగా అందిస్తున్న పుట్టపర్తి శ్రీసత్య సాయి సంస్థల సేవలు చాలా గొప్పవని ప్రముఖ సినీ నటుడు సుమన్ అభివర్ణించారు. సోమవారం కొండపాక శివారులో నిర్మించిన శ్రీసత్యసాయి సంజీవిని సెంటర ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి భగవాన్ అడుగు జాడల్లో నడుస్తున్న భగవాన్ మధుసూదన సాయి చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఇటీవల్ల గుండెకు వైద్యం చేయించుకున్న చిన్నారులను పల కరిస్తూ వైద్యసేవల గురించి అడిగి తెలుసుకొని వారి తల్లిదండ్రులకు మెమొంటులు అందించారు. నాలుగు నెలల క్రితం ప్రారంభమైన అసుపత్రిలో 34 మంది చిన్నారులకు గుండెలకు అపరేషన్లు చేయడం గొప్ప విషయమన్నారు. దేశంలో ప్రధానమైన ఐదు సేవలు సైనికులు, పోలీసులు, పారిశుధ్య కార్మికులు, రైతులు, వైద్యుల సేవలు ఎంతో కీలకమైనవని వారి సేవలు పొందిన వారు ఎప్పటి గుర్తుంచుకోవాలని సూచించారు. చిన్నారుల గుండెకు చికిత్సలు చేయడంలో ప్రైవేటు రంగంతో శ్రీ సత్యసాయి సేవలు అసుపత్రి చైర్మన్ శ్రీనివాస్ అధ్వర్యంలో పలు రాష్ట్రాల్లో పోటీ పడుతూ చేస్తున్నాయని తెలిపారు. చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న వైద్యుల సేవలను మరువలేనివని కొనియాడారు. అనంతరం అసుపత్రి చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్దిపేట ప్రాంతంలో ప్రేమభావం దండిగా ఉందన్నారు. తమ సంజీవని అసుపత్రుల ద్వారా ఎడ్యుకేట్ చేయడం, స్కిల్స్ నేర్పించడం, అవకాశాలు కల్పించడం అనే మూడు అంశాలతో ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. విశ్రాంతి సైతం ఎరగకుండా నిరంతరం వైద్య సేవలు అందిస్తు_న్న వైద్యులను ఆయన ప్రశంసించారు.



పిల్లలతో మాట్లాడుతున్న సినీ నటుడు సుమన్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

## 'వేల గొంతులు లక్ష డప్పులు' విజయవంతం చేయండి

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** కోట్లాది మంది ప్రజల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈనెల 7న మందకృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహించతలపెట్టిన వేల గొంతులు లక్ష డప్పులు మాదిగల సాంస్కృతిక మహా ప్రదర్శన కార్యక్రమానికి జగదేవ్‌పూర్ మండలంలోని మాదిగలంతా పార్టీలకు, సంఘాలకు అతీతంగా తరలిరావాలని ప్రోగ్రాం రాష్ట్ర చీఫ్ కో-ఆర్డినేటర్ అందె భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, కో-ఆర్డినేటర్ నాగభూషణం, మంజుల, మండల అధ్యక్షుడు రాజు, జేఏసి అధ్యక్షుడు మాసపాక యాదగిరి, ఉపాధ్యక్షులు జంగని బాలకృష్ణ, కిరణ్, జేఏసి ప్రధాన కార్యదర్శి గద్దం వెంకటేష్, కోశాధికారి బాబు, కార్యదర్శి మల్లేశం, మాదిగ జర్నలిస్టు జిల్లా అధ్యక్షుడు రామస్వామి, ఉపాధ్యక్షుడు శివదాస్, ఇటిక్యాల గ్రామ అధ్యక్షుడు కుమార్, మల్లేష్, దౌలాపూర్ అధ్యక్షుడు ముక్కెర నాగరాజు, పెద్దులు, వట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎల్లం, ఎమ్మార్పీఎస్ నాయకులు సాయి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్‌పై జాతీయ వర్క్‌షాప్

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణితశాస్త్రవిభాగం ఆధ్వర్యంలో లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం)లు, జనరేటివ్ ఏఐ అనే అంశంపై ఈనెల 1314 తేదీలలో జాతీయ వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేవారికి ఆ రెండు అంశాలపై పరివర్తనాత్మక ప్రపంచంలో బలమైన పునాదిని అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి ఎల్ఎల్ఎంలు, జనరేటివ్ ఏఐ పద్ధతులను అమలుచేయడంలో వారి నైపుణ్యాలను పెంపొందించడానికి ఈకార్యక్రమానికి రూపకల్పన చేసినట్టు కార్యశాల నిర్వాహకులు డాక్టర్ మోతాహర్‌రెజా, డాక్టర్ బి.ఎం.నాయుడు తెలియజేశారు. ఎల్ఎల్ఎం, జనరేటివ్ ఏఐల పరిచయం, ఏఐలో నీతి, సవాళ్లు, రియల్‌వరల్డ్ అప్లికేషన్లు, కేస్ స్టడీస్ వంటి అనేక కీలకమైన అంశాలను ఈ రెండురోజుల కార్యక్రమంలో విశదీకరిస్తామన్నారు. ఇందులో పాల్గొనేవారు వివిధ డొమైన్‌లలో ట్రాన్స్‌ఫార్మర్ ఆర్కిటెక్చర్‌లు, జనరేటివ్ టెక్స్ట్ మోడళ్లు, మల్టీమోడల్ ఏఐ అప్లికేషన్‌లతో సహా ఏఐలో అత్యాధునిక పురోగతులను అన్వేషించే అవకాశాన్ని కూడా పొందుతారని తెలిపారు. ప్రతిష్ఠాత్మక సంస్థలకు చెందిన గౌరవనీయమైన రీసోర్స్ పర్సన్‌లు ఆయాసెషన్‌లకు నాయకత్వం వహిస్తారని, వారిలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సిబా ఉదగత, కోల్‌కతా ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ అన్సుమన్ బెనర్జీ, ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ అనిమేష్ ముఖర్జీ, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ మోనేంద్ర శంకర్ దేశర్కర్, బెంగళూరులోని శామ్‌సంగ్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ ప్రవీణ్ ఉన్నట్టు వారు పేర్కొన్నారు. ఈవర్క్‌షాపులో విద్యావేత్తలు, పరిశోధక విద్యార్థులు, బిటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ స్థాయి విద్యార్థులు పాల్గొనవచ్చని, వారు ఏఐ, డేటాసైన్స్ రంగాలలో సమగ్రజ్ఞానం, ఆచరణాత్మక అనుభవం, విలువైన పరిశ్రమ అంతర్దృష్టులు, నెట్‌వర్కింగ్ అవకాశాలు, ఈరంగంలో భవిష్య పురోగతికి సంసిద్ధతను పొందవచ్చన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 11వ తేదీలోగా తమపేర్లు నమోదు చేసుకోవచ్చని, ఇతరత్రా వివరాలకు కార్యక్రమ సమన్వయ కర్తలు డాక్టర్ కె.కృష్ణ 99080 85343 లేదా డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి 98493 17334 లను సంప్రతించవచ్చని తెలిపారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ విద్యారంగానికి అన్యాయం

**షాద్‌నగర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

కేంద్రబడ్జెట్‌లో తెలంగాణ విద్యారంగానికి తీరని అన్యాయం జరిగిందని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్‌చౌహాన్ అన్నారు. దేశ విద్యారంగానికి మోదీప్రభుత్వం మొండిచేయి చూపిందని, విద్యను మరింత కార్పొరేట్ ప్రైవేటీకరణకు దగ్గరచేస్తున్న విధంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, గతం లోకంటే విద్యారంగానికి బడ్జెట్‌లో నామమాత్రంగా 0.2శాతం మాత్రమే పెరిగిందని రూ.1247.39కోట్ల నుండి 12500 మాత్రమే విద్యారంగానికి నిధులు పెరిగాయని, ఇవి విద్యారంగాభివృద్ధికి ఏమాత్రంసరిపోవని, గత పదిసంవత్సరాలకాలంలో తెలంగాణకు కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో చాలా అన్యాయం చేసిందని విమర్శించారు. విభజనహామీచట్టంలో ఉన్నవిధంగా విద్యారంగానికి కేటాయించాలని, జిల్లాకు ఒకనవోదయపాఠశాల,ట్రిబుల్‌ఐటీ,గిరిజన యూనివర్సిటీ లాంటిహామీలు ఆనాడు విభజనహామీలుగాచెప్పి నేటికి పదిసంవత్సరాలు పూర్తి కావస్తున్నదని, ఇప్పటివరకు బడ్జెట్‌లో ప్రవేశపెట్టకుండా, తెలంగాణకు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారని పవన్‌చౌహాన్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

### బిజెపి జిల్లా అధ్యక్షుడిపి సన్మానించిన బిజెపి నాయకులు



బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బిజెపి నాయకులు నర్సింలు, నవీన్ పటేల్

**వెల్దుర్తి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

మెదక్‌జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షులుగా వాల్దాస్ మల్లేష్ గౌడ్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈసందర్భంగా వెల్దుర్తి మండల మాజీ బిజెపి అధ్యక్షుడు నర్సింలు, బిజెవైఎం మండల అధ్యక్షుడు నవీన్‌పటేల్‌లు సోమవారం నూతన బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు.

## శుభకార్యంలో పాల్గొన్న ఎమ్మెల్సీ



గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

చిన్నశంకరంపేట పట్టణానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు లక్ష్మారెడ్డి సోమవారం నూతన గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించగా మెదక్‌ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మారెడ్డి, శశిధర్‌రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, మాజీ జడ్పిటిసి మాధవి, మాజీ సర్పంచి కుమార్‌గౌడ్, ప్రభాకర్, బాగారెడ్డిస్వామి పాల్గొన్నారు.

## సరస్వతి పూజలో సీనియర్ నాయకులు



సరస్వతి పూజలో పాల్గొన్న గూడెం మధుసూదన్‌రెడ్డి

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

వసంతపంచమిని పురస్కరించుకొని పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో కళింగ అసోసియేషన్ ఒరిస్సా వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి పూజలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నవీన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మచెందర్, తదితరులు పాల్గొన్నారు.

## నల్లపోచమ్మ ఆలయంలో పూజలు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామంలో శ్రీనల్లపోచమ్మ ఆలయంలో వసంతపంచమి సందర్భంగా భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు, గ్రామస్థులు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

### టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు

**కొండపాక, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. మండల పరిధిలోని దమ్మక్కపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యకర్తలకు అన్ని వేళాల అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలు కలిసి పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కా ంగ్రెస్ పార్టీ ముందుం టుదన్నారు. కార్యక్రమంలో ములుగు మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, మనోహరబాద్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు సంతోష్, టిపిసిసి నాయకులు గోపాల్‌రావు, తీగుల్ సర్పంచ్ కప్పర భాను, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ రాచకొండ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అనిల్‌రెడ్డి, అంకిరెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్ జలి గామ నర్సింగరావు, గణపతిరెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు వడ్డకొండ రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏర్పుల మల్లేశం, యూత్ కా ంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కుంచం రవి, ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి కొమ్ము భాను, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దమ్మక్కపల్లిలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



చెత్త సేకరణను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

## తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాలి

### -మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య

**గజ్వేల్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో తడి, పొడి చెత్తను వేరుచేసే విధానంపై వార్డు ప్రజలకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజలకు తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. చెత్తను బయట వేయకుండా మున్సిపల్ స్వచ్ఛ వాహనానికి అందించాలన్నారు. పట్టణం శుభ్రంగా ఉంటేనే మనమందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఆయనతోపాటు మున్సిపల్‌జవాన్ అక్బర్, సిబ్బంది ఉన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

**చేర్యాల, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** చేర్యాల పట్టణానికి చెందిన కందూరి యాదమ్మకు వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.19,500 చెక్కును సోమవారం వారి కుటుంబ సభ్యులకు బిఆర్ఎస్ నాలుగు మండలాల యూత్ ఇంచార్జ్ శివగారి అంజయ్య అందజేశారు. అందుకు కృషిచేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టౌన్ యూత్ అధ్యక్షుడు యాట బిక్షపతి, నాయకులు దేవర చంద్రారెడ్డి, బియ్య శ్రీను, పాక వెంకటయ్య, పాక చెన్నయ్య, కందూరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## పుస్తెలు, మెట్టెల పంపిణీ

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** అలయన్స్ సిద్దిపేట జిల్లా ఝాన్సీ క్లబ్ అధ్యక్షులు యంసాని హైమావతి ఆధ్వర్యంలో సోమవారం యంసాని రమాదేవి యాదగిరి, శ్రావణి, వినయ్‌కుమార్ దంపతుల సహకారంతో చింతమడక గ్రామానికి చెందిన నిరుపేద వధువుకు పుస్తెమట్టెలు, పెళ్లి చీర,పసుపు, కుంకుమ, గాజులు స్టీల్ సామాగ్రి అందజేశారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన అదనపు సిఐ



అంగన్‌వాడీలో చిన్నారితో మాట్లాడుతున్న అదనపు సిఐ ముత్యంరాజు

**గజ్వేల్, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ ఎన్‌క్లేవ్‌లోఉన్న 5వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం గజ్వేల్ అదనపు సిఐ ముత్యంరాజు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ పరిశుభ్రంగా ఉందని, అంగన్వాడీ కేంద్రాన్ని చూస్తే కార్పోరేట్ పాఠశాల తరహాలో కనిపిస్తుందన్నారు. పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రం మంచి వాతావరణంలో ఉందని, దీనికి కృషిచేసిన అంగన్వాడీ టీచర్ నాగరాణిని అభినందించారు. వారితో పాటు అంగన్వాడీ ఆయా లావణ్య తదితరులు ఉన్నారు.

## ఛలో హైదారాబాద్‌ను విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కోహెడ, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డుగ్రహీత మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎబిసిడి వర్గీకరణ అమలు జాప్యాన్ని నిరసిస్తూ ఈనెల 7న హైదారాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన వేయి గొంతులు, లక్ష డప్పులు భారీ సాంస్కృతిక కళా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 7న నిర్వహించే కార్యక్రమానికి మాదిగ,మాదిగ ఉపకులాలు పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ సాధిస్తేనే మాదిగ, మాదిగ ఉప కులాల కుటుంబాలలో వెలుగులు నిండుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంద ధర్మయ్య, ఎఎంసి చైర్మన్ బోయిని నిర్మలా జయరాజు, మాజీ జడ్పీటిసి లక్ష్మణ్, మాజీ సర్పంచ్ మంద రాజయ్య, వెల్పుల వెంకటస్వామి, జయశంకర్, రవీందర్, లింగాల సాయన్న, జాన్, రమేష్, బాబు, కొమురయ్య, లక్ష్మీనారాయణ, మల్లయ్య, రాజు, నవీన్, బాలయ్య, కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు



వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** సరస్వతీ అమ్మవారి జన్మదినం సందర్భంగా శ్రీవాణి స్కూల్ భారత్‌నగర్‌లో సోమవారం సరస్వతి అమ్మవారికి పూజ, గణపతి పూజ, కుంకుమార్చన, అక్షరాభ్యాస కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిహెచ్. సత్యం మాట్లాడుతూ ప్రతి ఏటా వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం చేయించడం జరుగుతుందన్నారు. అనంతరం పుస్తకాలు, పెన్నులు, అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు స్వాగత సత్కారం

**ఆమనగల్లు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

ఆమనగల్లు పురపాలక కార్యాలయానికి నూతనంగా కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన శంకర్‌నాయక్‌కు సోమవారం మండలపార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, మున్సిపాలిటీ అధ్యక్షుడు మానయ్య ఆధ్వర్యంలో స్వాగత సత్కారం లభించింది. కార్యాలయం వద్ద పార్టీశ్రేణులతో కలిసి కమిషనర్ శంకర్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణనాయక్, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్‌అలీమ్, కరీం, శేఖర్‌గౌడ్, దేవరశెట్టి మహేష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, రహీం, అంజాత్, రఫీ, శివ ఉన్నారు.

## చదువులతల్లిగా వనదుర్గామాత


చదువులతల్లి సరస్వతీదేవిగా వదుర్గాదేవి అలంకరణ దృశ్యం

**పాపన్నపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** వసంతపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏడుపాయల వనదుర్గా భవానీమాతను అక్షరస్వరూపిణి సరస్వతీమాతగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి సరస్వతీదేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి ఆయాప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆలయంలో అర్చకులు పార్థివశర్మ, మురళీశర్మ, రాజశేఖర్‌శర్మలు వేదమంత్రాలు వల్లిస్తుండగా భక్తులు పూజాకార్యక్రమాలు నిర్వహించగా అర్చకులు ఆశీర్వచనాలుచేసి తీర్థప్రసాదాలు అందచేశారు.

## నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే


సంగారెడ్డిలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపి మొండి చేయిచూపుతూ నిధుల కేటాయింపులో అన్యాయం చేసినందుకు నిరసనగా సోమవారం జిల్లాకేంద్రమైన సంగారెడ్డిపట్టణంలో టిపిసిసి ఆదేశాల మేరకు కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అన్నిరాష్ట్రాల అభ్యున్నతికి పాటుపడాల్సి ఉంటుందని, అభివృద్ధి, సంక్షేమపథకాలకు సరాసరిగా నిధులుకేటాయించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. బిజెపిపాలిత రాష్ట్రాలకు, ఎన్నికలను దృష్టిలోపెట్టుకుని నిధులుకేటాయిస్తూ తెలంగాణపై సవతితల్లిప్రేమ చూపడంతగదని హెచ్చరించారు. కార్యక్రమంలో టిజిఐఐసి చైర్మన్ తూర్పునిర్మియ జయప్రకాశ్‌రెడ్డి(జగ్గారెడ్డి), నాయకులు రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, ముంతాజ్‌సేట్, పల్లవి, పరశురాం పాల్గొన్నారు.

## సింగూరులో వెంకటేశ్వర కళ్యాణం కమనీయం


సింగూరులో కళ్యాణోత్సవం దృశ్యం

**పుల్‌కల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండలపరిధిలోని సింగూరుప్రాజెక్టు పరిసరాల్లో కొలువుదీరిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం 39వవార్షిక బ్రహ్మోత్సవాలు కమనీయంగా ప్రారంభం అయ్యాయి. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కళ్యాణసుందర శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అభిషేకాలు నిర్వహించి అర్చకులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు నాలుగు రోజులపాటు కొనసాగనున్నాయి. ఆలయంలో కొనసాగుతున్న వార్షికోత్సవాలను తిలకించేందుకు గ్రామస్థులతోపాటు పరిసరగ్రామాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు.

## కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడిఏ నూతన్‌కుమార్

**మనూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఏర్పాటుచేసిన కందుల కొనుగోలుకేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడిఎ) నూతన్ కుమార్ సూచించారు. సోమవారం మండలకేంద్రమైన మనూర్‌లో ఏర్పాటుచేసిన కందుల కొనుగోలుకేంద్రాన్ని నూతన్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా నూతన్‌కుమార్ మాట్లాడుతూ కందులకు ప్రభుత్వం 7550రూపాయల మద్దతుధరను కేటాయిస్తోందన్నారు. మధ్యదళారులకు అమ్ముకుని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మహేష్ కుమార్, కొనుగోలు కేంద్రం అధికారిణి స్వప్న, రైతులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో అక్షరాభ్యాసం

**నారాయణఖేడ్ టౌన్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌పట్టణంలోని కృష్ణవేణి స్కూల్‌లో వసంతపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులతో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం కావించి వసంతపంచమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.

## వినోద్‌ను పరామర్శించిన చైర్మన్

**నారాయణఖేడ్ టౌన్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండలపరిధిలోని అనారోగ్యానికిగురైన నర్సాపూర్‌తండాకు చెందిన వినోద్‌ను జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుట్టిపు మచ్చేందర్ సోమవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వినోద్‌కు ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో నాగల్‌గిద్ద మండలం మాజీ వైస్ ఎంపిపి పండరియాదవ్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు గంగారం, ర్యాలమడుగు మాజీ ఎంపిటిసి సభ్యులు ఆమ్రేనాయక్, శ్రీనివాస్‌పాటిల్, పార్టీ అధ్యక్షులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

**-బిజెఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు గోషికే యోహాన్**


మాట్లాడుతున్న బిజెఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు గోషికే యోహాన్

**కొల్చారం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ఈనెల 5వ తేదీన అసెంబ్లీ స్పెషల్ సెషన్‌తోపాటు క్యాబినెట్ మీటింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని, ప్రభుత్వనిర్ణయం హర్షణీయం అని బహుజన జాగృతి సమితి (బిజెఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు గోషికే యోహాన్ అన్నారు. సోమవారం కొల్చారం మండలపరిధిలోని రంగంపేటగ్రామంలోని బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహంముందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గోషికే యోహన్ మాట్లాడుతూ 75ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకోబోతున్న నిర్ణయం గర్వించదగ్గ విషయమని, అందుకు బహుజనుల జాగృతిసమితి తరపున రాష్ట్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఎందుకంటే బిసి కుల గణన ద్వారా చిట్ట చివరన ఉన్న బిసికి కూడా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అందించినటువంటి రాజ్యాంగ సంక్షేమఫలాలు అందుతాయని, అలాగే రాజకీయంగా, ఉద్యోగపరంగా వారికి లబ్ది చేకూరుతుందని, ఎస్సీ ఎబిసిడి వర్గీకరణ ద్వారా ఎస్సీలలో ఉన్నటువంటి 59కులాలకు వారిశ్రమకు దగ్గ ప్రతిఫలం అందుతుందని, అందుకు పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ అమరవీరుల త్యాగానికి ప్రతిరూపం ఎస్సీ రిజర్వేషన్ జరగడమని, అందుకు పోరాటబాటలువేసిన మందకృష్ణమాదిగ, రాష్ట్రమంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులులకు జాతి రుణపడి ఉంటుందని గోషికే యోహన్ అన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్‌మాదిగ, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వైస్‌ఎంపిపి అల్లు మల్లారెడ్డి, సంగాయిపేటగ్రామ శాఖాధ్యక్షులు సంగన్నగారి ఆగంగౌడ్, మాజీ సర్పంచ్ బద్యనాయక్, బహుజన నాయకులు జయరాజ్, నవీన్, జైసింగ్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.

## పశు పోషణపై అవగాహన

**-పశువుల పెంపకం పోషణలో తగు జాగ్రతలు తీసుకోవాలి**
**-వేల్పుగొండ పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సౌమ్య**

**టేక్మాల్,ఫిబ్రవరి,3, ప్రభాతవార్త:** రైతులు తమ పశువుల పెంపకం పోషణలో తగు జాగ్రతలు తీసుకోవాలని వేల్పుగొండ పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సౌమ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో పశుసంస్థ ఆధ్వర్యంలో పశుసంవర్ధకశాఖ సహకారంతో గ్రామంలో నిర్వహించిన పశువైద్యశిబిరంలో ఆమె మాట్లాడుతూ నూతన సాంకేతికతను తక్కువ ఖర్చుతో రైతుముంగిట్లో చేర్చి 90శాతం కచ్చితంగా అధిక పాలదిగుబడి సామర్థంగల మేలుజాతి ఆడ దూడలు పుట్టించి వాటిద్వారా రైతులు ఆదాయం పెంపొందించడం, తక్కువ సమయంలో మేలుజాతి పశువులను అభివృద్ధిచేయడం లింగనిర్ధారిత వీర్య నాలిక వినియోగం వలన 90శాతం కంటే ఎక్కువ మేలుజాతి ఆడదూడలు పుట్టి మందలో ఆవుల, గేదెల సంఖ్య గణనీయంగా పెరిగి రైతులకు పోషణ, లాభసాటిగా మారుతుందని గేదెల్లో ముర్ర, ఆవుల్లో, సాయి వాల్, గిర్,జెర్సీ సంకరజాతి వీర్యనాలికలు అందుబాటులో ఉన్నాయని ఒక లింగనిర్ధారణ వీర్యనాలిక ధర రూ.675 “సబ్సిడీవాటా రైతువాటా రూ.250” ఒక పశువు వరుసగా రెండుసార్లు లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమగర్భధారణ చేసినప్పటికీ చూలు కట్టకపోతే రైతుకు రెండుసార్లు చెల్లించిన వాటా ధనం రూ.500 తిరిగి రైతు అకౌంట్లో తెలంగాణ పశుగణాభివృద్ధిసంస్థ జమ చేస్తుంది. మొదటి కృత్రిమగర్భధారణ విఫలమై రెండో కృత్రిమగర్భధారణ ద్వారా మగదూడ జన్మిస్తే రూ.250 తిరిగి రైతుకు జమ చేయబడతాయని అన్నారు. ఈశిబిరంలో 16 పశువులకు గర్భకోశ పరీక్షలు 18 పశువులకు సాధారణ చికిత్సలు 13దూడలకు నట్టలనివారణ మందులువేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో టేక్మాల్ మండల పశువైద్య జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ హనుమంతు, సిబ్బంది ఆనంద్‌కుమార్ కృష్ణ గోపాలమిత్రులు కె. దేవరాజ్, డి.రవీందర్, ఎం.దీపక్‌కుమార్, రైతులు, గ్రామస్థులున్నారు.

## విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం అవసరం


సరస్వతి శిశుమందిర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసంచేయిస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** నేటి కంప్యూటర్ కాలంలో విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం ఎంతో అవసరమని, అట్టి సంస్కారం నేర్పించడానికి సరస్వతి శిశుమందిర్‌లు ఎంతో కృషి చేస్తున్నాయని రామాయంపేట అశోక్‌సింఘాల్ సరస్వతి శిశుమందిర్ మాజీ ప్రధాన ఆచార్యులు వీరారెడ్డి అన్నారు. సోమవారం వసంతపంచమిని పురస్కరించుకొని ఇక్కడి శిశుమందిర్ భవనంలో సరస్వతీమాతకు ప్రత్యేక పూజలుచేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో చిన్నారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాపీఠం ఆధ్వర్యంలో సరస్వతి శిశుమందిర్ 1972 నుండి చిన్నారులకు, విద్యార్థులకు ఆత్మీయ, ఆధ్యాత్మిక, మానసిక వికాసం కోసం కృషి చేస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా 12వేల శిశుమందిరాలలో ఆచార్యులు విద్యార్థులకు విద్యనందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆచార్యులు కవిత, పండరినాథ్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమాన్ని పరిశీలించిన సంగారెడ్డి ఆర్డీవో


వృద్ధాశ్రమంలో వృద్ధులతో మాట్లాడుతున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన అమీన్‌పూర్‌లోని ది నెస్ట్ వృద్ధాశ్రమాన్ని జిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరి ఆదేశాలమేరకు సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ది నెస్ట్ వృద్ధాశ్రమాన్ని పరిశీలించారు. ఆశ్రమంలోగల వృద్ధులతో నేరుగామాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమనిర్వహణలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాల్సిందిగా నిర్వాహకులకు సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలితకూమరి, అమీన్‌పూర్ తహశీల్దార్ రాధా, ఆశ్రమ నిర్వాహకులు ఎం.అరుణ, వంశీకృష్ణ, మండల గిర్ధవార్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 3, పభాతవార్త:** విద్యార్థులు కష్టపడి చదవితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ డా॥శివనాయక్ అన్నారు. సోమవారం మండలపరిధిలోని ఖాజాపూర్‌తండాలో ఎన్‌ఎఫ్‌హెచ్‌సి స్వచ్ఛంద సంస్థ సహకారంతో గురుకుల పాఠశాల పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీచేశారు. విద్యార్థులకు నిత్యం సాయంత్రం తండాలో ప్రత్యేక తరగతులను నిర్వహించి పరీక్ష వ్రాయడానికి సిద్ధం చేస్తున్నట్లు శివ తెలిపారు. ఈకార్యక్రమంలో స్వరూప, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బొడ్మట్‌పల్లిలో ఘనంగా బీరప్ప కామరాతి కల్యాణం


బీరప్ప కామరాతి కల్యాణంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్న దృశ్యం

**టేక్మాల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండలంలో బొడ్మట్‌పల్లి గ్రామంలో సోమవారం బీరప్ప కామరాతి కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉదయం బియ్యం సుంకు, డోలు చప్పుళ్ళ, ఒగ్గుకళాకారుల విన్యాసాల మధ్య కురుమ కుటుంబీకులు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం లింగాలకు గంగస్నానం చేయించి ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయ ఆవరణంలో పెద్దపట్నంవేసి బీరప్ప కామరాతి కల్యాణాన్ని జరిపించారు. బీరప్ప కల్యాణోత్సవానికి మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ హాజరయి బీరప్ప ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయనిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీరప్ప పెద్ద పండుగను వీక్షించేందుకు స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయకమిటీ నిర్వాహకులు, కుల సంఘాల నాయకులు భక్తులు పాల్గొన్నారు.

## లక్ష డప్పుల వాల్ పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**రామాయంపేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న తలపెట్టిన లక్షడప్పులు కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం రామాయంపేట పట్టణంలోని స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించడం జరిగింది. మెదక్ జిల్లావ్యాప్తంగా మాదిగ, ఉపకులాల నాయకులు, కార్యకర్తలు, ప్రతిగ్రామం నుండి పెద్దసంఖ్యలో తరలి రావాలని కోరారు. అలాగే ప్రతి కుటుంబంలోని సభ్యులందరూ డప్పు చంకకు వేసుకొని సభకు తరలిరావాలని హైదరాబాద్‌లోజరిగే కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వాల్‌పోస్టర్ రిలీజ్ కార్యక్రమంలో పాతూరి రాజుమాదిగ, లద్ద నర్సింలుమాదిగ, మల్యాల కిషన్‌మాదిగ, బుర్ర అనిల్ మాదిగ, ఎర్ర దుర్గంమాదిగ, గంగాపురం సంజుమాదిగ, ఎర్ర నరేష్‌మాదిగ, అక్కిరిగారి రాజుమాదిగ, రమేష్‌మాదిగ, చిప్పకు సంపత్‌మాదిగ, ఎర్ర రాములుమాదిగ తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ


చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** మాసాయిపేట మండలకేంద్రంలో సోమవారం లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు యాదగిరి మాదిగ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

**వెల్దుర్తి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** వెల్దుర్తి మండలపరిధిలోని కుకునూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం వసంతపంచమిని పురస్కరించుకొని చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడి టీచర్‌లు సిద్ధమ్మ, రమణ, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.


చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

## ఘనంగా వసంతపంచమి వేడుకలు


ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సరస్వతీమాతకు పూజలు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వసంత పంచమివేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి, తెలుగు అధ్యాపకుడు బాలాగౌడ్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో సరస్వతీమాతకు ప్రత్యేకపూజలు వైభవోపేతంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతిపాల్గొని విద్యార్థినీవిద్యార్థులు చక్కగా చదువుకోవాలని, సరస్వతీమాత ఆశీస్సులతో జరగబోయే వార్షికపరీక్షల్లో అందరూ ఉత్తమమైన మార్కులతో ఉత్తీర్ణతసాధించాలని ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మల్లేశం, ఆంజనేయులు, యాదగిరి, స్వామి, అశోక్‌గౌడ్, నరసింహులుగౌడ్, శ్రీదేవి, మంగ, సురేష్‌గౌడ్, శ్రీశైలం, యాదగిరి, మస్తాన్‌వలితోపాటు అధ్యాపకేతర బృందం, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ


ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

**చౌటకూరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన చౌటకూరులోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ దరఖాస్తును స్వీకరించారు. గ్రామానికిచెందిన రజకులు ఇనాం సర్టిఫికెట్ ఇవ్వాలని వినతి చేస్తూ దరఖాస్తును అందచేసినట్లు తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

## నిరంతరం 108 అంబులెన్స్ సేవలు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మండల ప్రభుత్వవైద్యాధికారి మధుకర్

**గుమ్మడిదల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** గుమ్మడిదలమండలం మున్సిపాలిటీపరిధిలోగల ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం నుండి తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన నూతన 108 వాహనం అందుబాటులోకి వచ్చింది. దానిని ప్రభుత్వ వైద్యాధికారి మధుకర్ ప్రారంభించారు. అత్యవసర సేవావాహనం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తుందని తెలిపారు. ఇంతకు ముందు అత్యవసర వాహనం 108 కావాలంటే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి, అలాగే టోల్‌ప్లాజా వారి నుండి సేవలనుపొందేవారమని అన్నారు. మండలప్రజలు ఎన్నోసంవత్సరాలనుండి ఎదురుచూస్తున్న అత్యవసర 108 వాహనం తెలంగాణరాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేకచొరవ తీసుకొని కేటాయించినట్లు తెలిపారు. అత్యవసర వాహనసిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ తక్షణసహాయం అందించేవిధంగా సేవలందిస్తారని అన్నారు. గుమ్మడిదల మండలంతోపాటు మున్సిపాలిటీ పరిధిలో అన్నిగ్రామాలకు నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిహెచ్ఈవో శ్రీనివాసరావు, ఫార్మసీశ్రీనివాస్, అత్యవసర 108సిబ్బంది సిహెచ్.రాజు పైలట్, టి.నవీన్ ఈసిటిటి, ముజీబ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత పశు వైద్యశిబిరం


ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**నర్సాపూర్ రూరల్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండలపరిధి రెడ్డిపల్లిగ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. ఈపశు వైద్యశిబిరంలో 22పశువులకు గర్భకోశవ్యాధి నివారణ చికిత్సలు, 4పశువులకు చూడి నిర్ధారణపరీక్షలు, 40దూడలకు నట్టలనివారణ మందులు, 8పశువులకు సాధారణచికిత్సలు, 4పశువులకు కృత్రిమగర్భధారణ ఇంజెక్షన్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమములో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జనార్దన్. డాక్టర్ సౌమిత్‌కుమార్, డాక్టర్ ప్రియాంకజునిర్ వెటర్నరీ ఆఫీసర్ ఆంజనేయులు, నర్సాపూర్ మండల ఓబిసి సెల్ అధ్యక్షులు అశోక్‌గౌడ్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ సత్యనారాయణ, గోపాలమిత్ర రామకృష్ణ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ దశదినకర్మలో పాల్గొన్న నాయకులు


మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ చిత్రపటానికి నివాళులు

**కొల్చారం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మాజీఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ దశదినకర్మను సోమవారం సంగారెడ్డిజిల్లా మల్కాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈదశదినకర్మకు కొల్చారం మండలంనుంచి మాజీజడ్పిటిసి ముత్యంగారి మేఘమాల సంతోష్‌కుమార్, వరిగుంతం సొసైటీచైర్మన్ చిన్నారపు ప్రభాకర్, బిఆర్ఎస్‌పార్టీ యూత్ ఐకాన్ నాయకులు రవితేజరెడ్డి, ఆది సత్యనారాయణ, ఆది లక్ష్మయ్య, కన్నయ్యవల్ల గోవర్ధన్‌లు హాజరై మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ చిత్రపటానికి నివాళులు అర్పించారు.